బెంగళూరుకు ఆఖరి ప్లేఆఫ్స్ బెర్తు

ఆర్‌సీబీ అద్భుత:

చెన్నైపై చిరస్మరణీయ విజయం • సమిష్టిగా రాణించిన డుప్లెసిస్ సేన • డిఫెండింగ్ చాంప్ సీఎస్‌కే ఔట్

కోహ్లీ(47)

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అద్భుతం చేసింది! అవును ఆశలు లేని స్థితి నుంచి పోరాటాన్ని అణువ ణువునా నింపుకుంటూ సంచలన ప్రదర్శనతో కదంతొక్కింది. లీగ్‌లో ప్రథమార్ధంలో వరుస ఓటములతో కూనరిల్లిన ఆర్ సీబీ...డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్‌ను మట్టికరిపించింది. తమ సొంత ఇలాఖాలో అభిమా నుల అశేష మద్దతు మధ్య చెన్నైతో నువ్వానేనా అన్నట్లు సాగిన మ్యాచ్‌లో బెంగళూరు విజయ ఢంకా మోగించింది. 219 పరుగుల లక్ష్యఛేదనలో చెన్నైని 191 పరుగులకు పరిమితం చేస్తూ ప్లేఆఫ్స్‌లో ఆఖరి బెర్తును దక్కించుకుని ఔరా అనిపించుకుంది. ప్రాణంగా పోరాడిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ సమిష్టి ప్రదర్శనతో విజృంభించింది. డుప్లెసిస్, కోహ్లీ బ్యాటింగ్‌తో 200ల మార్క్ అందుకున్న ఆర్ సీబీ..చెన్నై బ్యాటర్లకు తమదైన రీతిలో కళ్లెం వేసి టైటిల్ వేటలో కీలక దశకు చేరకుంది. ఈ క్రమంలో వరుసగా ఆరో విజయంతో ఆర్‌సీబీ ప్లేఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. ఇక మిగిలింది టైటిల్ వేటే!

బెంగళూరు: ఐపీఎల్‌లో మరో చిరస్మరణీయ మ్యాచ్ అభిమానులను కట్టిపడేసింది. ఆఖరి బంతి వరకు ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెడుతూ సాగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ అదరగొట్టింది. 30వేల మంది ప్రేక్షకుల సమక్షంలో సాగిన పోరులో బెంగళూరు విజయమో, వీర స్వర్గమో అన్నట్లు పోరాడింది. శనివారం జరిగిన అనధికారిక నాకౌట్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 27 పరు గుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. తొలుత డుప్లె సిస్(39 బంతుల్లో 54, 3ఫోర్లు, 3సిక్స్‌లు), కోహ్లీ(29 బంతుల్లో 47, 3ఫోర్లు, 4సిక్స్‌లు) రాణించడంతో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 218/5 స్కోరు చేసింది. పాటిదార్(41), గ్రీన్(38 నాటౌట్) రాణించారు. శార్దుల్ (2/61), సాంట్నర్(1/23) ఫర్వాలేదనిపించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన చెన్నై 191/7 స్కోరుకు పరిమితమైంది. రచిన్ రవీంద్ర(37 బంతుల్లో 61, 5ఫోర్లు, 3సిక్స్‌లు), జడేజా(22 బంతుల్లో 42 నాటౌట్, 3ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు. యశ్ దయాల్(2/42), గ్రీన్(1/18) రాణిం చారు. డుప్లెసిస్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

చెన్నై పడుతూ లేస్తూ:

బెంగళూరు నిర్దేశించిన లక్ష్యఛేద నలో చెన్నైకి ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. మ్యాక్స్ వెల్ తొలి ఓవర్ మొదటి బంతికే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. లీగ్‌లో సూపర్ ఫామ్‌మీదున్న గైక్వాడ్ ఔట్ కావడం చెన్నైని ఒకింత ఒత్తిడిలోకి నెట్టింది. ఫస్ట్‌డౌన్‌లో వచ్చిన మిచెల్(4) దయాల్ మూడో ఓవర్‌లో కోహ్లీ క్యాచ్‌తో రెండో ఔట య్యాడు. క్రీజులోకి వచ్చిన రహానే(33) జతగా రచిన్ బ్యాటు ఝులిపిం చాడు. సిరాజ్ 4వ ఓవర్లో రచిన్, రహానే మూడు ఫోర్లతో 13 పరుగులు వచ్చాయి. అదే దూకుడు కనబరుస్తూ దయాల్‌ను కూడా మూడు ఫోర్లు అరుసుకోవడంతో పవర్‌ప్లే ముగిసే సరికి చెన్నై 2 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. లక్ష్యం దిశగా సాఫీగా సాగుతున్న తరుణంలో రహానే వికెట్ కోల్పోయింది. శివమ్ దూబే(7), సాంట్నర్(3) నిరాశపర్చగా ఆఖర్లో జడేజా, ధోనీ గెలిపించేందుకు చేసిన ప్రయత్నం నెరవేరలేదు. బ్యాటింగ్‌లో అదరగొట్టిన ఆర్‌సీబీ..బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ మెరుపులు మెరిపించింది.

డుప్లెసిస్, కోహ్లీ దూకుడు:

టాస్ గెలిచిన చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ లక్ష్యఛేదన వైపు మొగ్గు చూపాడు. ఓపెనర్లు విరాట్ కోహ్లీ, డుప్లెసిస్ ఆర్‌సీబీకి అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. తాను ఎదుర్కొన్న రెండో బంతిని కోహ్లీ బౌండ రీగా మలువగా, డుప్లెసిస్ ఫోర్, సిక్స్‌తో చెలరేగడంతో శార్దుల్ రెండో ఓవర్లో 16 పరుగులు వచ్చాయి. తుషార్ వేసిన మరుసటి ఓవర్లో కోహ్లీ రెండో భారీ సిక్స్‌లతో విరుచుకుపడటంతో స్కోరుబోర్డుకు 13 పరు గులు జతకలిశాయి. అయితే మూడు ఓవర్లు ముగిసిన వెంటనే వరు ణుడు అంతరాయం కల్గించడంతో మ్యాచ్ 40 నిమిషాల పాటు ఆగి పోయింది. తిరిగి తెరిపినిచ్చిన తర్వాత ఆర్‌సీబీకి పరుగుల రాక మంద గించింది. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా 42 పరు గులు చేసింది. ఇక లాభం లేదనుకున్న కోహ్లీ, డుప్లెసిస్ గేర్ మార్చారు. సాంట్నర్ 10వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన కోహ్లీ..బౌండరీ వద్ద మిచెల్ క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరుగడంతో 78 పరుగుల భాగ స్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు కోహ్లీ ఔటైనా డుప్లెసిస్ జోరు ప్రద ర్శిస్తూ జడేజా బౌలింగ్‌లో ఓ ఫోర్, రెండు భారీ సిక్స్‌లతో 20 పరు గులు పిండుకున్నాడు. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో వివా దస్పద రీతిలో డుప్లెసిస్ రనౌట్‌గా వెనుదిరిగాడు. బౌలింగ్‌కు మార్పుగా వచ్చిన సిమర్‌జీత్‌సింగ్‌ను రజత్ పాటిదార్(41) రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో స్వాగతం పలికాడు. డుప్లెసిస్ తర్వాత క్రీజులోకొచ్చిన కామెరూన్ గ్రీన్..పాటిదార్‌కు జతకలిశాడు. వీరిద్దరు ఇన్నింగ్స్‌ను మరోస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. 18వ పరుగుల వద్ద గైక్వాడ్ క్యాచ్ విడిచిపెట్టడంతో గ్రీన్‌కు లైఫ్ లభించింది. శార్దుల్ బౌలింగ్‌లో సిక్స్‌కు ప్రయత్నించిన పాటిదార్..బౌండరీ వద్ద మిచెల్‌కు దొరికిపోయాడు. ఆ తర్వాత కార్తీక్(14), మ్యాక్స్‌వెల్(16)తక్కువ బంతుల్లో విలువైన పరు గులు సాధించడంతో ఆర్‌సీబీ 200 మార్క్ అందుకుంది.

9 — ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్‌కు చేరడం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు ఇది తొమ్మిదోసారి

1 — లీగ్‌లో వరుసగా ఆరు ఓటములు, ఆరు విజయాలు సాధించిన తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలిచింది.

3 — 17 ఏండ్ల ఐపీఎల్‌లో చెన్నై ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించకపోవడం ఇది మూడోసారి (రెండేండ్లు నిషేధం మినహాయించి)

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 218/5(డుప్లెసిస్ 54, కోహ్లీ 47, శార్దుల్ 2/61, సాంట్నర్ 1/23), చెన్నై: 20 ఓవర్లలో 191/7(రచిన్ 61, జడేజా 42 నాటౌట్, దయాల్ 2/42, గ్రీన్ 1/18)

హార్దిక్‌పాండ్యాపై వేటు

ముంబై: ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉన్నాయి. వరుస ఓటములతో ఈ సీజన్‌ను ముంబై పేలవంగా ముగించగా, స్లో ఓవర్‌రేట్ కారణంగా కెప్టెన్ పాండ్యాపై మ్యాచ్ సస్పెన్షన్‌తో పాటు రూ.30 లక్షల జరిమానా పడింది. శుక్రవారం వాంఖడే వేదికగా లక్నో సూపర్‌జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో పడాల్సిన ఓవర్ల కంటే తక్కువ వేసినందుకు పాండ్యాపై వేటు పడింది. దీంతో వచ్చే సీజన్‌లో ముంబై ఆడే తొలి మ్యాచ్‌కు దూరం కానున్నాడు. ఈ సీజన్‌లో హార్దిక్ మూడోసారి స్లోఓవర్‌రేట్‌కు పాల్పడిన కారణంగా జరిమానాతో పాటు సస్పెన్షన్ విధించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు..

మే 25న న్యూయార్క్‌కు భారత్

న్యూఢిల్లీ: వెస్టిండీస్, అమెరికావేదికలుగా జరుగనున్న ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ జట్టు ఈ నెల 25న న్యూయార్క్‌కు బయల్దేరి వెళ్లనుంది. రోహిత్‌శర్మ సారథ్యంలోని టీమ్‌ఇండియాలో హార్దిక్‌పాండ్యా, సూర్యకుమార్, బుమ్రా, పంత్, అర్ష్‌దీప్‌సింగ్, అక్షర్‌పటేల్‌తో పాటు సహాయక బృందం వెళ్లనున్నారు. వాస్తవానికి ఈ నెల 21న వెళ్లాల్సి ఉన్నా.. క్రికెటర్లు కొన్ని రోజులు కుటుంబంతో గడిపనుండటంతో షెడ్యూల్ మార్చినట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

పాయింట్ల పట్టిక

జ		ఆ	గె	ఓ	ఫ.తే.	ర	పా
కోల్‌కతా	✓	13	9	3	1	1.42	19
రాజస్థాన్	✓	13	8	5		0.27	16
హైదరాబాద్	✓	13	7	5	1	0.40	15
బెంగళూరు	✓	14	7	7		0.45	14
చెన్నై	x	14	7	7		0.39	14
ఢిల్లీ	x	14	7	7		-0.37	14
లక్నో	x	14	7	7		-0.66	14
గుజరాత్	x	14	5	7	2	-1.06	12
పంజాబ్	x	13	5	8		-0.34	10
ముంబై	x	14	4	10		-0.31	8

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు ఫ.తే. : ఫలితం తేలనివి.

ఎలోర్డా చాంప్ నిఖత్ జరీన్

భారత్‌కు 12 పతకాలు

అస్తానా(కజకిస్థాన్): ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు ముందు భారత స్టార్ బాక్సర్ నిఖత్‌జరీన్ పసిడి పతకంతో మెరిసింది. ఎలోర్డా బాక్సింగ్ టోర్నీలో నిఖత్‌తో పాటు మీనాక్షి టైటిళ్లతో తళుక్కుమన్నారు. శనివారం జరిగిన మహిళల 52కిలోల ఫైనల్ బౌట్‌లో నిఖత్ 5-0తో జాజిర ఉర్రబయేవా(కజకిస్థాన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు ప్రదర్శించిన ఈ ఇందూరు బాక్సర్ ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వకుండా ముందుకు సాగింది. పదునైన పంచ్‌లకు తోడు జాబ్స్, హుక్స్‌తో రౌండ్‌రౌండ్‌కు తన ఆధిక్యాన్ని పెంచుకుంటూ పోయింది. మరోవైపు 48కిలోల తుది పోరులో మీనాక్షి 4-1తో రమనోవా సైదాహోన్(ఉజ్బెకిస్థాన్)పై గెలిచి పసిడి ఖాతాలో వేసుకుంది. మిగతా బౌట్లలో అనామిక(50కి), మనీశ(60కి) రజత పతకాలు సాధించారు. యైఫబాసింగ్, అభిషేక్, విశాల్, గౌరవ్ చాహన్, సోను మంజు, షలకసింగ్, మోనిక కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మొత్తంగా భారత్ 12 పతకాలతో టోర్నీని ఘనంగా ముగించింది.

ఫైనల్లో సాత్విక్ జోడీ

థాయ్‌లాండ్ టోర్నీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి ఫైనల్లోకి దూసుకెళ్లారు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-11, 21-12తో లు మింగ్-చీ, టాంగ్ కి వీ జంట(చైనీస్ తైపీ)పై అద్భుత విజయం సాధించింది. 35 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ఏకపక్ష పోరులో సాత్విక్, చిరాగ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. పదునైన స్మాష్‌లకు తోడు నెట్‌గేమ్, డ్రాప్ షాట్లతో సాత్విక్, చిరాగ్..ప్రపంచ 80వ ర్యాంక్ జోడీపై అలవోక విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఐదేండ్ల క్రితం ఇక్కడే థాయ్‌లాండ్ టైటిల్ దక్కించుకున్న ఈ స్టార్ జోడీ మరోమారు అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని చూస్తున్నది. మహిళల డబుల్స్ సెమీస్‌లో తనీషా క్రాస్టో, అశ్విని పొనప్ప జోడీ 12-21,20-22తో థాయ్‌లాండ్ టాప్‌సీడ్ జంట, రవిండ చేతిలో ఓడింది.



శనివారం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం తడిసి ముద్దయ్యింది. ఐపీఎల్‌లో ఆదివారం పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడనుంది.

భగ్గుమన్న బంగారం

తులంపై రూ.870 పెరిగిన ధర



హైదరాబాద్, మే 18: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన ధరలు శనివారం భారీగా పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.870 పెరిగి రూ.74,620 పలికింది. అంతక్రితం ధర రూ.73,750గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ.800 ఎగబాకి రూ.67,600 నుంచి రూ.68,400 కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో పాటు ఫెడరల్ రిజర్వు వచ్చే సమీక్షలోనే వడ్డీ రేట్లు తగ్గించనుండటం, యూఎస్ సూచీ డౌ జోన్స్ తొలిసారిగా 40 వేల మార్క్‌ను అధిగమించడం పెట్టుబడిదారుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. దీంతో తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో వీటి ధరలు భారీగా పుంజుకున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. పసిడితోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.4 వేలు అధికమై రూ.96,500 పలికింది. అంతకుముందు ఇది రూ.92,500గా ఉన్నది. గత రెండు రోజుల్లోనే వెండి రూ.8 వేలు పుంజుకున్నది.

మరింత సరళతరం కానున్న ఎఫ్‌డీఐ నిబంధనలు!

న్యూఢిల్లీ, మే 18: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నిబంధనలు మరింత సరళతరంకాబోతున్నాయి. ఇటీవల స్పేస్ రంగంలోకి వచ్చే విదేశీ పెట్టుబడులను నిబంధనలను సరళతరం చేసిన కేంద్ర సర్కార్..ఎంపిక చేసిన రంగాల్లో ఎఫ్‌డీఐ నిబంధనలు మారే అవకాశాలున్నాయని. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన నూతన సర్కార్ ఈ నిబంధనలను మార్చే అవకాశాలున్నాయని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ) సెక్రటరీ రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. ఏప్రిల్-డిసెంబర్ 2023 మధ్యకాలంలో దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 13 శాతం తగ్గి 32.03 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, టెలికం, ఆటో, ఫార్మా రంగాల్లో ఎఫ్‌డీఐలు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని తాజా నివేదికలో వెల్లడించింది. అలాగే ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటీవ్ స్కీమ్స్(పీఎల్ఐ) కింద ఇప్పటి వరకు రూ.1.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అలాగే ఈ సంస్థలు రూ.9 లక్షల కోట్ల విక్రయాలు జరపగా, రూ.3.45 లక్షల కోట్ల ఎగుమతులు చేశాయని, 8 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయన్నారు.

వాణిజ్య

ఐదు వారాల్లో 50 వేల కోట్లు

తరలించుకుపోయిన విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు

ఎన్నికల అలజడితో ఆందోళనలో ఎఫ్ఐఐలు

ఎఫ్ఐఐలు వరుసగా అమ్మకాలు జరుపుతున్నారు. అస్థిరత పరిస్థితులు కొనసాగుతుండటం, ఎన్నికల్లో అనిశ్చితి, చైనా మార్కెట్లు పుంజుకోవడంతో ఎఫ్ఐఐలు తమ పెట్టుబడులను తరలించుకుపోతున్నారు.

- జయకృష్ణ గాంధీ, ఎంకీ గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్

న్యూఢిల్లీ, మే 18: విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీ సర్కార్‌కు మెజార్టీ వచ్చే అవకాశాలు లేవని అంచనాలు వెల్లడికావడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు భారీ స్థాయిలో తమ పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. గడిచిన ఐదు వారాల్లో ఏకంగా రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. సార్వత్రిక ఎన్నికలు ప్రారంభం కంటే కొన్ని రోజుల ముందునుంచే ఎఫ్ఐఐలు అమ్మకాల బటన్ నొక్కుతునే ఉన్నారు. ఏప్రిల్ 8 నుంచి 12 మధ్యకాలంలో రూ.13,672 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసిన ఎఫ్ఐఐలు..ఏప్రిల్ 15 నుంచి మే 17 వరకు రూ.50,260 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. మొత్తంగా ఈ ఏడాది ఎఫ్ఐఐలు రూ.1,17,788 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారని ఎక్స్ఛేంజ్ నివేదికలో వెల్లడించింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు కూడా ఉండటంతో ఎఫ్ఐఐలు పెట్టుబడులు తరలించుకుపోవడానికి కూడా కారణం.

జోరు తగ్గని డీఐఐలు

ఒకవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గుచూపుతుంటే..దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు మాత్రం నిధులను భారీగా కుమ్మరించారు. గడిచిన ఐదు వారాల్లో రూ.64,400 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అలాగే డీఐఐలు ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1,79,122 కోట్ల విలువైన షేర్లను కొనుగోళ్లు చేశారు. ఏప్రిల్ 12 నుంచి మే 17 మధ్యకాలంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ స్వల్పంగా తగ్గింది. గడిచిన ఏడాది పైగా భారీగా నిధులు కుమ్మరించిన ఎఫ్ఐఐలు..ఎన్నికల్లో బీజేపీ పార్టీకి పూర్తి స్థాయిలో మెజార్టీ వచ్చే అవకాశాలు లేవని సర్వేలు వెల్లడిస్తుండటంతో ఎఫ్ఐఐల్లో ఆందోళన నెలకొన్నది. మరోవైపు, భారతీయ స్టాక్ మార్కెట్ల ఒడిదొడుకుల సూచీ(ఇండియా వీఐఎక్స్) తొలి విడుత ఎన్నికలప్పటి నుంచి ఇప్పటి వరకు 77 శాతానికి పైగా పెరగడం విదేశీ మదుపరుల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నది. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై మదుపరులలో నెలకొన్న అనుమానాలు, ఆందోళనలకు ఇండియా వీఐఎక్స్ అద్దం పడుతున్నదని మెజారిటీ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

చైనాకు తరలిపోయిన పెట్టుబడులు

భారత్‌లో వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్న ఎఫ్ఐఐలు.. పొరుగు దేశమైన చైనా మార్కెట్లో పెట్టుబడులు పెట్టారు. చైనా సూచీలు అంచనాలకుమించి రాణించడంతో ఎఫ్ఐఐలు తమ ఇన్వెస్ట్‌మెంట్లను ఇక్కడికి తరలించారు. షాంఘై కంపోజిట్ ఇండెక్స్ సూచీ ఈ ఏడాది 15 శాతం రిటర్నులు పంచింది. 2024 ఫిబ్రవరిలో కనిష్ఠ స్థాయికి జారుకున్న సూచీ ఇప్పటి వరకు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడంతో ఎఫ్ఐఐలు తమ పెట్టుబడులను ఇక్కడ ఇన్వెస్ట్ చేశారు. ఒక్క మార్చి నెలలోనే ఎఫ్ఐఐలు 5 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులను చైనా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేశారు.

డాటా సెంటర్లకు డిమాండ్

న్యూఢిల్లీ, మే 18: భారత్‌లో డాటా సెంటర్లకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో దేశీయ, అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలు ఇక్కడ డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా డాటా సెంటర్ల సామర్థ్యం 950 మెగావాట్లకు చేరుకున్నదని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సీబీఆర్ఈ తాజాగా వెల్లడించింది. ఆసియా పసిఫిక్ దేశాలైన ఆస్ట్రేలియా, హాంకాంగ్, జపాన్, సింగపూర్, కొరియా దేశాలను అధిగమించినట్లు అయిందని తెలిపింది. చైనా తర్వాత అత్యధిక కెపాసిటీ సామర్థ్యం కలిగివున్నది భారత్‌లోననే తెలిపింది. జపాన్‌లో డాటా సెంటర్ల కెపాసిటీ 773 మెగావాట్లు కాగా, సింగపూర్‌లో 718 మెగావాట్లు, హాంకాంగ్‌లో 613 మెగావాట్లు, కొరియాలో 531 మెగావాట్లు. 2024 నుంచి 2026 మధ్యకాలంలో భారత్‌లో అదనంగా 850 మెగావాట్ల కెపాసిటీ కలిగిన డాటా సెంటర్లు అందుబాటులోకి రానున్నట్లు సీబీఆర్‌ఈ చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు భారత్ కేంద్ర బిందువుగా మారుతున్నదని, ముఖ్యంగా తమ డిజిటల్ సేవలను ఇక్కడి నుంచే అందించడానికి డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తున్నాయన్నారు.

మళ్లీ 74 వేలపైకి సెన్సెక్స్

ప్రత్యేక ట్రేడింగ్‌లోనూ జోరు



ముంబై, మే 18: ప్రత్యేక ట్రేడింగ్‌లోనూ దేశీయ స్టాక్ మార్కెట్ల ర్యాలీ కొనసాగింది. వరుసగా మూడోరోజు సూచీలు లాభాల్లో ముగిశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు కుమ్మరించడంతో ఒక దశలో 245 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తిరిగి 74 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 88.91 పాయింట్లు అందుకొని 74,005.94 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 35.90 పాయింట్లు ఎగబాకి 22,502 వద్ద స్థిరపడింది. దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీలైన ఎన్ఎస్ఈ, బీఎస్ఈలకు చెందిన ప్రాథమిక సైట్లలో అంతరాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనేందుకు ఈ శనివారం ప్రత్యేక ట్రేడింగ్ నిర్వహించారు. ఉదయం 9.15 గంటలకు ప్రారంభమైన ట్రేడింగ్ మళ్లీ 10 గంటలకు నిలిపివేయగా..తిరిగి 11.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు నిలిపివేశారు. సుమారు 1.45 గంటల పాటు సాగిన ప్రత్యేక ట్రేడింగ్‌లో సూచీలు కదంతొక్కాయి. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రికార్డు స్థాయి రూ.4,12,36,791.05 కోట్లకు చేరుకున్నది.

- నెస్లె ఇండియా 2.33 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- వీటితోపాటు పవర్‌గ్రిడ్, టాటా మోటర్స్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్బీఐ, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, విప్రో, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, ఇన్ఫోసిస్, టైటాన్ షేర్లు నష్టపోయాయి.
- అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు మించి తగ్గడంతో డౌ జోన్ సూచీ రికార్డు స్థాయి 40 వేల మార్క్‌ను అధిగమించడం దేశీయ సూచీలకు దన్నుగా నిలిచాయి.
- మొత్తంమీద ఈవారంలో సెన్సెక్స్ 1,341.47 పాయింట్లు లేదా 1.84 శాతం, నిఫ్టీ 446.8 పాయింట్లు లేదా 2 శాతం చొప్పున లాభపడ్డాయి.



వెటరన్ బ్యాంకర్ ఎన్ వాఘల్ మృతి

ముంబై, మే 18: వెటరన్ బ్యాంకర్ ఎన్ వాఘల్ మరణించారు. ఆయన వయస్సు 88 ఏండ్లు. ఐసీఐసీఐ బ్యాంక్‌కు నాయకత్వం వహించిన వాఘల్.. అనారోగ్య సమస్యలతో శనివారం మధ్యాహ్నం మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. వాఘల్‌కు భార్య, కుమారుడు మోహన్, కుమార్తె సుధ ఉన్నారు. 2010 సంవత్సరానికిగాను వాఘల్ పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు. వాఘల్ మృతికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సంతాపం తెలియజేశారు.

సెక్షన్ 87ఏ రిబేట్ తెలుసా?

పాత, కొత్త పన్ను విధానాల్లో రూ.12,500, 25,000 రాయితీకి అవకాశం

న్యూఢిల్లీ, మే 18: ఆదాయ పన్ను (ఐటీ) నిబంధనల ప్రకారం.. పాత, కొత్త పన్ను విధానాల్లో వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు రూ.25,000 వరకు రాయితీని పొందే వెసులుబాటున్నది. ఐటీ చట్టంలోని సెక్షన్ 87ఏ కింద ఈ రిబేటు ఈ దేశంలో నివసిస్తున్న ట్యాక్స్‌పేయర్లకు లభిస్తుంది.

పాత పన్ను విధానంలో..

పాత పన్ను విధానంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.5 లక్షలు దాటనట్టైతే.. సెక్షన్ 87ఏ కింద ట్యాక్స్ రిబేటును పొందవచ్చు. ఈ విధానంలో రూ.2.50 లక్షల వరకు ఏ పన్నూ లేదన్న విషయం తెలిసిందే. మిగతా రూ.2.50 లక్షలకు 5 శాతం పన్ను పడుతుంది. రూ.5 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారికి ఇది రూ.12,500 పన్నుకు సమానం. దీంతో ఈ మొత్తాన్ని సెక్షన్ 87ఏ కింద రిబేటుగా క్లెయిం చేసుకోవచ్చు. ఒకవేళ వార్షిక ఆదాయం రూ.4 లక్షలే ఉంటే ట్యాక్స్ రిబేటు రూ.7,500గానే ఉంటుంది. మొత్తంగా చూసినట్టైతే ఈ విధానంలో ట్యాక్స్ రిబేటు ఎంతైనా తగ్గుతుందిగానీ, రూ.12,500 మాత్రం దాటదు.

కొత్త పన్ను విధానంలో..

సెక్షన్ 115బీఏసీ(1ఏ) కింద కొత్త పన్ను విధానాన్ని ఎంచుకున్న ట్యాక్స్ పేయర్స్‌కు ఒక ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.7 లక్షలు దాటనట్టైతే.. సెక్షన్ 87ఏ కింద ట్యాక్స్ రిబేటును అందుకోవచ్చు. నిజానికి గతంలో రూ.5 లక్షల వరకే ఈ ప్రయోజనం అందుబాటులో ఉన్నది. కానీ 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను దీన్ని రూ.7 లక్షలకు పెంచారు. ఇక కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షల వరకు ఎలాంటి పన్నూ లేదు. ఒకవేళ వార్షిక ఆదాయం రూ.7 లక్షలుగా ఉంటే.. ఆ మిగతా రూ.4 లక్షలకు రూ.25,000 పన్ను రిబేటు లభిస్తుంది. తొలి రూ.3 లక్షలకు 5 శాతం చొప్పున రూ.15,000, ఆ తర్వాతి లక్ష రూపాయలకు 10 శాతం చొప్పున రూ.10,000. మొత్తం రూ.25,000 రాయితీ అందుకోవచ్చు. అయితే వార్షిక ఆదాయం రూ.7 లక్షలు దాటితే మాత్రం రిబేటు లభించదు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.